క్లుప్తంగా

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



సీతారామపురం: మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓ మస్తాన్‌వలి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోగ్యం శ్రీనివాసులు, గొడ్లవీటి వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్లు పేరాల శ్రీనివాసులు, డీ వెంకటేశ్వర్లు, సహాయఅధ్యక్షురాలు పీపీపీ కుమారి, సీనియర్ నాయకులు పీసీఎం కొండయ్య, ప్రసాద్, నరసింహరాజు, ఏడుకొండలు, బాలగురవయ్య, ఆనంద్, రవీంద్ర, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.74 లక్షలతో కోటపాడుకు సీసీరోడ్డు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు పంచాయతీ మజరా గ్రామమైన కోటపాడుకు రూ.74 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఎస్‌ఈ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన అధికారులతో కలిసి కోటపాడు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సుబ్బరాజు, డీఈ ఏడుకొండలు, ఏఈ సాంబశివారెడ్డి, స్థానిక నాయకుడు వల్లూరు వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి


సీతారామపురం: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మెనూను పాటిస్తూ నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం ఆయన ఓగూరువాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను పరీక్షించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. విద్యార్థుల బూట్ల కొలతల ప్రక్రియను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఆయన వెంట హెచ్‌ఎం కొండయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో సీజనల్ వ్యాధులపై కళాజాత ప్రదర్శనను గురువారం నిర్వహించారు. సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ ఆధ్వర్యంలో కళాజాత బృందం డయేరియా, మలేరియా, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించింది. అనంతరం కళాజాత కళాకారులను సర్పంచ్ సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి భాను ప్రకాష్, సచివాలయ ఉద్యోగులు సునీత, రుచిత, స్థానిక నాయకులు పసుపులేటి శ్రీరామ్, ఏలూరి కిరణ్, అంగన్‌వాడీ పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం విజయవంతంపై ధన్యవాదాలు



మాట్లాడుతున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు: పోలేరమ్మ గ్రామోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ మాజీ ఎమ్మెల్యే, కార్యనిర్వాహకులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఆయన అల్లూరులోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలేరమ్మ గ్రామోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూల అలంకరణ, విద్యుత్ కార్మికులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాలకృష్ణంరాజు, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డలు..హాకీలో మెరికలు

- జాతీయ క్రీడపై శ్రీకొలను జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినుల మక్కువ
- అండర్ -14 విభాగంలో రిషిత
- అండర్-16 విభాగంలో చెంచులక్ష్మి
- జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



హాకీ శిక్షణలో విద్యార్థినులు

అనుమసముద్రంపేట: మండలంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. తల్లిదండ్రులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కీడలపై మక్కువ పెంచుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్నారు.

జాతీయ క్రీడపై మక్కువ

మన జాతీయ క్రీడ హాకీ. ఈ క్రీడకు గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా ప్రోత్సాహం ఉండదు. అలాంటి హాకీ క్రీడలో శ్రీకొలను జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు థామస్ పీటర్ అందించిన ప్రోత్సాహంతో హాకీ క్రీడపై మక్కువ పెంచుకుని సత్తాచాటుతున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన బాలికలకు హాకీపై అవగాహన లేదు. వారికి హాకీపై వ్యాయామ ఉపాధ్యాయుడు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులకు సైతం వివరించడంతో వారు సైతం తమ బిడ్డలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. తొలుత వ్యాయామ ఉపాధ్యాయుడు హాకీ బ్యాట్‌లను సమకూర్చి పాఠశాల ఆవరణలో సాధన చేయించారు. కొద్ది రోజులకు వారు మెరుగ్గా రాణించడంతో క్రీడా మెళకువలను నేర్పించారు. దీంతో విద్యార్థినులు మండలస్థాయి స్కూల్‌గేమ్స్‌లో సత్తాచాటారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు మరింత దృష్టి సారించి శిక్షణ ఇచ్చారు. దీంతో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికై ఆదర్శంగా నిలిచారు. దీంతో మండలంలోని మిగిలిన పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు హాకీ శిక్షణపై దృష్టి సారించారు.

➡ శ్రీకొలనుకు చెందిన రిషితది రైతు కుటుంబం. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో హాకీపై మక్కువ పెంచుకుంది.



చెంచులక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆమెలోని క్రీడానైపుణ్యాన్ని గమనించిన వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడంతో స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభకనబరిచింది. అండర్-14 విభాగంలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించింది. గతేడాది నవంబర్11న హర్యానాలో జరిగిన జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికై సత్తాచాటింది.

➡ శ్రీకొలనుకు చెందిన చెంచులక్ష్మిది రైతు కుటుంబం. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమె సైతం వ్యాయామ ఉపాధ్యాయుడు అందించిన ప్రోత్సాహంతో హాకీ క్రీడపై మక్కువ పెంచుకుంది. స్కూల్‌గేమ్స్‌లో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తాచాటింది. గతేడాది నవంబర్11న హర్యానాలో జరిగిన జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ హాకీ పోటీల్లో అండర్ -17 విభాగంలో పాల్గొని ప్రతిభకనబరిచి పేరుతీసుకొచ్చింది.

జాతీయ జట్టులో ఆడడమే లక్ష్యం



చిన్నతనం నుంచి క్రీడలంటే ఇష్టం. తల్లిదండ్రులతో పాటు హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో హాకీపై మక్కువ పెంచుకున్నా. జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్‌లో పాల్గొన్నాను. జాతీయ హాకీ జట్టుకు ఎంపిక కావాలన్నదే లక్ష్యం. అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నా.

–చెంచులక్ష్మి, 9వతరగతి, శ్రీకొలను జెడ్పీ ఉన్నతపాఠశాల

తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నదే ఆకాంక్ష



క్రీడలంటే ఎంతో ఇష్టం. తల్లిదండ్రులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో హాకీపై మక్కువ పెంచుకున్నా. హాకీలో రాణించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నదే నా ఆకాంక్ష.

– రిషిత, ఏడో తరగతి, శ్రీకొలను జెడ్పీ ఉన్నతపాఠశాల

చెరువు పనులపై విజిలెన్స్ తనిఖీలు



జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలోని పేరపనాయుడు చెరువు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందడంతో జిల్లా విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. చెరువు పనుల నాణ్యతను పరిశీలించి కొలతలు సేకరించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఈ మహిత మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ ఆదేశాల మేరకు చెరువు కట్ట మరమ్మతు పనులపై తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. విజిలెన్స్ ఏఈ అవినాష్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ జితేంద్ర, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలలోపు నారునే నాటుకోవాలి

చేజర్ల: నెల రోజుల లోపు నారునే నాటుకోవాలని ఏఓ శశిధర్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. కేఎస్‌ఎం-1638 రకం నాటిన 30 రోజులకే వెన్నుతీస్తోందని రైతులు విన్నవించడంతో ఏఓ వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్‌ఎం -1638, ఆర్ఎన్ఆర్-15048 రకాలను నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15వ తేదీలోగా నార్లు పోసుకోవాలని తెలిపారు. 25 రోజులలోపు నారునే నాటుకోవాలని సూచించారు. ముదురు నారు నాటడం, వాతావరణం మునురు పట్టి ఎండ తక్కువగా తగులుతుండడంతో త్వరగా వెన్నుతీస్తోందని వివరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వరినాట్లు వేసే సమయంలో దుక్కిలో ఎకరాకు బస్తా యూరియాను చల్లాలని సూచించారు. వారం రోజుల తర్వాత బస్తా యూరియా, అరబస్తా పొటాస్ చల్లడం వల్ల కొత్త పిలకలు వచ్చి సమానంగా వెన్నులు వస్తాయని తెలిపారు.

వింజమూరు పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



వింజమూరు :మాట్లాడుతున్న జెడ్పీటీసీ గణపం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గం పంచాయతీలోని వార్డుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సర్పంచ్ ఎన్ సుజన, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, బీజేపీ నేత పులిచర్ల నారాయణరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడులో మాట్లాడుతున్న సర్పంచ్ దిలీప్ కుమార్

వరికుంటపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గురువారం గ్రామ సభలు నిర్వహించారు. వరికుంటపాడులో జరిగిన గ్రామసభలో సర్పంచ్ కే దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులతో పాటు ప్రజలు సహకరించాలన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. పంచాయతీలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శి లేదా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం వివిధ శాఖల ద్వారా పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై చర్చించి తీర్మానాలు రూపొందించారు. ఏపీఓ అజాంఖాన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

వసతిగృహాల పరిశీలన

సంగం: సంగం, కొరిమెర్లలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాలను పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్ గురువారం పరిశీలించారు. వసతిగృహాల్లోని ప్రధానమైన సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ పథకంలో భాగంగా జిల్లాలో ఉపాధి నిధులు రూ.67.33 కోట్లతో 146 కిలోమీటర్ల పొడవునా సిమెంట్‌రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతిలోపు రోడ్లను పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతామన్నారు. జిల్లాలో ఇప్పటికే 86 కిలోమీటర్ల పొడవున సీసీరోడ్లను పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో దెబ్బతిన్న పంచాయతీ రహదారులకు సైతం మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈఈ సుబ్బరాజు, డీఈ ఏడుకొండలు, రామయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు వినీత్, అశీష్, తన్మయ్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ అశోక్‌కుమార్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వరికుంటపాడు: రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని కనియంపాడులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు తమ భూసమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ యశ్వంత్‌కుమార్, సర్వేయర్ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు ఐదు అర్జీలు

సీతారామపురం: మండలంలోని దేవిశెట్టిపల్లిలో రెవెన్యూ సదస్సును గురువారం నిర్వహించారు. ౨ రైతుల నుంచి భూసమస్యలపై ఐదు అర్జీలు అందినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. కాగా శుక్రవారం నెమళ్లదిన్నె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయరు భాగ్యలక్ష్మి, వీఆర్వో మురళి, తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు:అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

ఆత్మకూరురూరల్: మండలంలోని దేపూరు, బండారుపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెండు గ్రామాల్లో భూసమస్యలపై రైతుల నుంచి 45 వినతులు అందాయని తహసీల్దార్ సు. దీర్ తెలిపారు. ప్రతిఅర్జీని ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. డీటీ స్వరూప్, వీఆర్ఓలు మురళీ మోహన్‌రావు, బికారి సాహెబ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కావలి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి సూచించారు. రుద్రకోట గ్రామస్తులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. నేరాల కట్టడి, శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా నేరాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు. అనంతరం సైబర్ మోసాలు, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలు, పోలీసు చట్టాలు, శిక్షలు, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.



రుద్రకోటలో అవగాహన కల్పిస్తున్న కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి

7న క్రికెట్ టోర్నమెంట్

సీతారామపురం: మండలంలోని సింగారెడ్డిపల్లిలో యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 7న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతి రూ.5116 నగదుతో పాటు కప్‌లు అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు టోర్నమెంట్ ఎంట్రీ ఫీజు రూ.500, బాల్ ఫీజు రూ.100 చెల్లించి ఈ నెల 6వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 83416 98898, 93475 44752, 88674 57300 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చేజర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

గుర్రం కళేబరం ఖననానికి చర్యలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట బుధవారం నెల్లూరు – ముంబై రహదారిపై లారీ ఢీకొని గుర్రం మృతిచెందిన విషయం తెలిసిందే. అటవీ శాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కళేబరాన్ని శుక్రవారం ఖననం చేయనున్నట్లు డీఆర్వో పిచ్చిరెడ్డి గురువారం రాత్రి తెలిపారు. అది పెంపుడు గుర్రమా లేక అడవిలో తిరిగేదా అనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి

ఉదయగిరి : ఉదయగిరికి చెందిన ఆటోవాలాలు టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌ను గురువారం కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆయన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కావలి: పట్టణంలోని మద్దూరుపాడు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు కావలిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కావలి ఏరియా ఆస్పత్రి సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి హుటాహుటినా నెల్లూరుకు తరలించారు. క్షతగాత్రులకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

పొగమంచు పరదా



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో గురువారం పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు తెరలు వీడలేదు. దీంతో ముంబై జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక హెడ్‌లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

రేషన్ డీలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

కావలి: కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 86 రేషన్ షాపులకు సంబంధించి డీలర్ల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీఓ ఎం వంశీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఉన్న రేషన్ షాపులను ప్రజల సౌకర్యార్థం విభజన చేయడం జరిగిందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే రేషన్ షాపులతో పాటు గతంలో ఉన్న రేషన్ షాపులకు సంబంధించి డీలర్ల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు స్థానికులై ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కావలిలోని ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 19న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కావలిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్లు, దరఖాస్తు ఫారాలు, ఇతర సమాచారం కోసం మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు.

డీలర్ల ఖాళీల వివరాలు

➡ అల్లూరు మండలం అల్లూరు, అల్లూరుపేట 2, సింగపేటఇస్కపల్లి పట్టపుపాళెం 2, నార్త్‌ఆములూరు.

➡ బోగోలు మండలం బోగోలు, జువ్వలదిన్నె మజరా పాతపాళెం, సాంబశివపురం, విశ్వనాథరావుపేట.

➡ దగదర్తి మండలం బోడిగుడిపాడు, చెన్నూరు, దామవరం, కట్టుబడిపాళెం, ప్యాడిసన్‌పేట, తడకలూరు, తురిమెర్ల, ఉలవపాళ్ల.

➡ కావలి టౌన్ 14,అన్నగారిపాళెం 2, చలంచర్ల, గౌరవరం, కొత్తపల్లి, పూలదొరువు.

➡ దుత్తలూరు మండలం దుత్తలూరు, కొత్తపేట, లక్ష్మీపురం, వావిల్లవారిపల్లి, మందలనాయుడుపల్లి, నందిపాడు, తురకపల్లి.

➡ జలదంకి మండలం జలదంకి, చామదల, దాసరిఅగ్రహారం, హనుమకొండపాళెం, కమ్మవారిపాళెం

➡ కలిగిరి మండలం గంగిరెడ్డిపాళెం, జిర్రావారిపాళెం 2, కలిగిరి, కొండారెడ్డిపాళెం, లక్ష్మీపురం, పెద్దకొండూరు, రాజుపాళెం. -వింజమూరు మండలం గోళ్లవారిపల్లి, కాటేపల్లి, రావిపాడు, వెంకటాద్రిపాళెం, వింజమూరు టౌన్ 6 .

➡ కొడవలూరు మండలం బసవాయపాళెం, బొంతలపాళెం, గండవరం, కమ్మపాళెం, మిక్కిలింపేట, నార్త్‌రాజుపాళెం 3, యల్లాయపాళెం

➡ విడవలూరు మండలం చౌకచర్ల, ముదివర్తి ,పార్లపల్లి, తుమ్మగుంట, ఊటుకూరు 3, విడవలూరు 8 ఖాళీలు ఉన్నాయి.

వరి పంటలో ఎరువుల యాజమాన్యం కీలకం

మర్రిపాడు: వరిపంటలో ఎరువుల యాజమాన్యం కీలకమని ఏఓ ఎస్ రామమోహన్ తెలిపారు. మండలంలోని భీమవరం, పొంగూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. భీమవరంలో వరి పంటను పరిశీలించి రైతులకు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. నత్రజని ఎరువైన యూరియాను ఒక్కసారి కాకుండా మూడు దఫాలుగా వేసుకుంటే తెగుళ్ల ఎక్కువగా ఆశించవని తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వాడవద్దని, చిరుపొట్ట దశలో పొటాషియం ఎరువును వినియోగించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించ్చనునని వివరించారు. వరిలో సూక్ష్మ పోషకమైన జింక్ లోపిస్తే ఆకులపై ఇనుము తుప్పు మచ్చలు కనిపిస్తాయని తెలిపారు. దాని నివారణకు జింక్ సల్ఫేట్‌ను ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొంగూరులో పొగాకు పంటను పరిశీలించి ఆకుముడత ఉన్నట్లు గుర్తించారు. తెల్లదోమతో ఆకుముడత వస్తుందని, నివారణకు ఎకరాకు ఏసిటామిప్రైడ్ 20శాతం ఎస్‌పీ 60 గ్రాముల మందును పిచికారీ చేయాలని తెలిపారు. వ్యాధి ఎక్కువగా సోకిన మొక్కలను తొలగించి పొలానికి దూరంగా పడేయాలని సూచించారు. వీఏఏలు ప్రవీణ్, పెంచలయ్య, వెటర్నరీ అసిస్టెంట్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ రామమోహన్

పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం



ఉదయగిరి: మాట్లాడుతున్న ఎంఈఓ తోట శ్రీనివాసులు



అనుమసముద్రంపేటలో..

ఉదయగిరి: పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీల పాత్ర కీలకమైందని ఎంఈఓ తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు ప్రతిరోజూ పాఠశాలలను సందర్శించి పారిశుధ్యం, తాగునీరు, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించాలని సూచించారు.అనంతరం ఎస్ఎంసీ కమిటీ విధులు, బాధ్యతలను వివరించారు. రిసోర్సుపర్సన్లు రామకృష్ణారెడ్డి, ఫణికుమార్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి పాఠశాల అభివృద్ధిలో ఎస్ఎంసీల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఈ నెల 4న పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. రిసోర్సుపర్సన్లుగా శివకోటారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, మార్కండేయులు వ్యవహరించారు.

వరికుంటపాడు/అనుమసముద్రంపేట/ మర్రిపాడు: వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు ఎంఈఓ-2 సీహెచ్ రమణయ్య ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్లు పీ మాలకొండయ్య, కేవీ కాంతారావు, డీ చంద్రమౌళి పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. అలాగే అనుమసముద్రంపేటలో ఎంఈఓలు ఎం జ్యోతి, డీ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్లు హరిప్రసాద్, బీ గణపతి, సీహెచ్ రాజారామిరెడ్డి హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లకు శిక్షణ ఇచ్చారు. అలాగే మర్రిపాడులోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ-2 ధనలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

పాఠశాలల అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

చేజర్ల: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీల సభ్యులు పాలుపంచుకోవాలని ఎంఈఓ-2 మస్తానయ్య అన్నారు. మండలంలోని పాఠశాలల యాజమాన్య కమిటీల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎస్ఎంసీ కమిటీల విధులు, బాధ్యతలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 మస్తానయ్య మాట్లాడుతూ ఈ నెల 4న పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం హైమావతి, సీఆర్పీలు సుబ్రహ్మణ్యం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.